క్లుప్తంగా

ఆయా పోస్టులకు దరఖాస్తులు

చోడవరం రూరల్: అంగన్‌వాడీ సహాయకురాలు(ఆయా) పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు రావికమతం సమగ్ర శిశు అభివృద్ధి ప్రాజెక్టు అదనపు అధికారి ఎస్.పుష్పాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుచ్చియ్యపేట మండలం బుచ్చియ్యపేట-1 కేంద్రంలో పోస్టు బీసీ-డీకి, చోడవరం మండలం సీమునాపల్లి కేంద్రంలో పోస్టు జనరల్ కేటగిరీకి కేటాయించామన్నారు. జూలై నాటికి 21 నుంచి 35 మధ్య వయసు కలిగిన అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 12వ తేదీ లోగా రావికమతంలోని సంస్థ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని, లేదా పోస్టు ద్వారా పంపించాలని సూచించారు.

కె. కోటపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో మంగతాయారు తెలిపారు. కె. కోటపాడు మండలం కె.కె.అగ్రహారం, దేవరాపల్లి మండలం ములకలాపల్లి-2లో ఆయా పోస్టులు ఓసీ కేటగిరీకి కేటాయించామన్నారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ప్రాజెక్టు కార్యాలయానికి లేదా పోస్టు ద్వారా అందజేయాలన్నారు.

ముగిసిన ఉచిత శిక్షణ తరగతులు



గణితంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న రామారావు

రావికమతం: టి.అర్జాపురం క్లస్టర్ పరిధిలో ఉచిత శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. పలు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు సీఆర్పీ గుంటూరు రామారావు గణితం, సైన్స్‌లో మెలకువలు నేర్పిస్తూ ఇక్కడ 20 రోజులుగా శిక్షణ ఇచ్చారు. వీరికి స్టడీ మెటీరియల్ అందించారు. క్లస్టర్ పరిధిలోని 60 మంది విద్యార్థులు ఈ ఏడాది శిక్షణ పొందారు.

ఆకట్టుకుంటున్న సురభి నాటకాలు



సతీసావిత్రి నాటక ప్రదర్శన

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా మహారాజుల కోటల ఆకృతిలో వేసిన సెట్‌లో సురభి నాటకాలను ప్రదర్శిస్తున్నారు. శనివారం రాత్రి ప్రదర్శించిన సతీసావిత్రి నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఉత్సవాలు ముగిసిన వరకు వివిధ పౌరాణికలు ఇక్కడ ప్రదర్శించనున్నారు.

గురుదేవుల ఆశ్రమంలో పౌర్ణమి పూజలు



పౌర్ణమి పూజల్లో పాల్గొన్న భక్తులు

నర్సీపట్నం: బలిఘట్టం ఉత్తరవాహిని పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో పౌర్ణమి పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఇక్కడ పౌర్ణమి పూజలకు వేలాది మంది భక్తులు తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా విడతల వారీగా పూజలు నిర్వహించారు. వరుసగా మూణ్నెల్లపాటు పౌర్ణమి పూజలు ఆచరిస్తే దోషాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. దీంతో పెద్ద ఎత్తున రావడంతో ఆశ్రమం కిటకిటలాడింది. వీరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆశ్రమం నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. పూజలు అనంతరం గురుదేవుల అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మట్టిరోడ్డులో వాహనదారుల ఇక్కట్లు

కె.కోటపాడు: ఉగ్గినవలస-కృష్ణారాయుడిపేట గ్రామాల మధ్య మట్టిరోడ్డు అధ్వానంగా దర్శనమిస్తోంది. రెండు గ్రామాల ప్రజలతోపాటు ఆర్.వై.అగ్రహారం గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు ఈ మార్గమే ప్రధానం. కెనాల్ మార్గాన్ని ఆనుకున్న మట్టిరోడ్డు గొయ్యిలు పడటంతోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ఎక్కువయ్యాయి. వాటిల్లో వర్షపునీరు నిలిచి ఉండడం వల్ల ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటేనే ఆందోళన చెందుతున్నారు. మట్టి రోడ్డు సమస్యకు అధికారులు పరిష్కారం చూపి రాకపోకల కష్టాలను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విత్తు బెంగ లేదిక!

- ఆర్బీకేల్లో 1,200 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం
- రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు త్వరలో పంపిణీ



నాగయ్యపేట ఆర్బీకేలో పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

దేవరాపల్లి: గతంలో ఖరీఫ్ సాగుకు సమాయత్తమయ్యే రైతన్నకు ఒకవైపు విత్తనాలు దొరుకుతాయో లేదోనని బెంగ ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అటువంటి భయమే లేకుండా పోయింది. రైతు భరోసా కేంద్రాల పుణ్యమా అని నేరుగా ఇంటి వద్దకే విత్తనాలు అందుతున్నాయి. దాంతో ధైర్యంగా సాగుకు ఉపక్రమిస్తున్నాడు. ప్రస్తుత ఖరీఫ్‌కు 1,200 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. దేవరాపల్లి మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 2,800 హెక్టార్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు.

పెట్టుబడి సాయం విడుదల

ఖరీఫ్ సాగుకు రైతులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెట్టుబడి సాయం కింద ఇటీవల వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ యోజన ద్వారా రైతుల ఖాతాల్లో రూ.7,500 జమ చేసింది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ వరి విత్తనాలను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

8 రకాల వరి విత్తనాలు సిద్ధం

మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాలకు ప్రభుత్వం విత్తనాలు సరఫరా చేసింది. వీటిలో సోనామసూరి-65 క్వింటాళ్లు, సాంబమసూరి-165 క్వింటాళ్లు, అమర రకం-100 క్వింటాళ్లు, శ్రీధృతి రకం-370 క్వింటాళ్లు, మార్టేరు సాంబ-32 క్వింటాళ్లు, స్వర్ణ రకం-80 క్వింటాళ్లు, నెల్లూరు సన్నాలు-5 క్వింటాళ్లు, శ్రీకాకుళం సన్నాలు-383 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి. మరోవైపు వేసవి దుక్కులు పూర్తి చేసుకున్న రైతులు తొలకరి వర్షాలు కురవగానే ఖరీఫ్ వరి నారు మడులు తయారీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

విత్తనాల కోసం పడిగాపులు లేవిక!

గత టీడీపీ హయాంలో విత్తనాల కోసం మండల కేంద్రాల్లో పడిగాపులు కాసేవారు. కొన్నిసార్లు విత్తనాల దొరక్క కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఆర్బీకేలతో అన్నదాతల చెంతకే విత్తనాలు సరఫరా చేస్తుండటంతో వారి కష్టాలు తప్పాయి. వరి విత్తనాలు కోసం ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారు.

80 శాతం మొలక కట్టి ఉంటే



20 ఆర్బీకేల్లో ఖరీఫ్ వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. 1,200 క్వింటాళ్ల ఇండెంట్ పెట్టగా శతశాతం విత్తనాలు ఆర్బీకేలకు వచ్చేశాయి. ఆర్బీకే స్థాయిలో 80 శాతం మేర మొలక కట్టి ఉంటే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఎకరాకు బస్తా చొప్పున త్వరలోనే పంపిణీ చేస్తాం. యాభై శాతం సబ్సిడీపై సుడోమోనాస్ ప్యాకెట్లను రైతులకు అందజేస్తాం.

– వై. కాంతమ్మ, ఏవో, దేవరాపల్లి

చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం

ఐసీడీఎస్ పీవో కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గణేష్



పీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. గొలుగొండలో ఐసీడీఎస్ పీవో కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొలుగొండ, నాతవరం మండలాల అంగన్‌వాడీ కేంద్రాలకు ఇక్కడ నుంచే సేవలందడం ఆనందంగా ఉందన్నారు. రెండు మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. పౌష్టికాహారం అందిస్తూ చిన్నారులకు సృజనాత్మకమైన విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, గొలుగొండ ఐసీడీఎస్ పీవో గౌరీశ్రీ, సర్పంచ్ కసపల్లి అప్పారావు, ఎస్సీ సెల్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు 'సన్మార్గమే' సాధక శతకం



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

చోడవరం రూరల్: దారి తప్పుతున్న నేటి యువతకు సన్మార్గ సాధక శతకం ఎంతగానో ఉపకరిస్తుందని పలువురు వక్తలు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక మదర్ థెరిసా పారా మెడికల్ కళాశాలలో మల్లాది సోమేశ్వరశర్మ విరచిత 'సన్మార్గ సాధక శతకం' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల కరస్పాండెంట్ ఎ.వి.ఎస్.వి.ఎస్.ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయుడు పేరి వెంకట కృష్ణమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు, పెద్దల పట్ల గౌరవం తగ్గిపోతున్న యువతలో ఈ పుస్తకం మార్పు తీసుకురాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. రచయితలు శ్రీనాధముని గోపాలాచార్యులు, నండూరి రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని రచయిత భావోద్వేగాలను తన శతక రచనలో ఇనుమడింప చేశారని అభినందించారు. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు, గ్రంథ రచయిత సోమేశ్వరశర్మ తన పుస్తక రచనకు కారణాలను, ఆసక్తిని వివరించారు. వ్యాఖ్యాత గంపా శ్రీదేవి, విశ్రాంత ఉపాధ్యాయులు కె.వి.జగన్నాథరావు, ఎల్.ముత్యాలనాయుడు, సీనియర్ జర్నలిస్టు ఎ.రాంబాబు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: నవరత్నాల పథకాలు ప్రతీ ఇంటికి నూరుశాతం చేరుతున్నాయని, దీనివల్ల పేదలకు అన్ని విధాలా న్యాయం చేకూరిందని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏఎల్‌పురంలో నాల్గో రోజు ఆదివారం ఆయన ప్రతి వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో వర్షం కురుస్తున్న ఆగకుండా కార్యక్రమం నిర్వహించారు. నాలుగు రోజులుగా ప్రజలు నుంచి వస్తున్న ఆదరణ మరవలేనిదని తెలిపారు. కనకదుర్గ వీధిలో డ్రైనేజీ సమస్య ఉందని, దీనివల్ల ఇబ్బందులు ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఈ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టారని తెలిపారు. అర్హతే కొలమానంగా పార్టీలను చూడకుండా వీటిని ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. ఇటువంటి పాలన చేస్తున్న సీఎంకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత, పార్టీ నాయకులు, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చడమే జగనన్న ధ్యేయం



నీలకంఠాపురంలో ప్రజా సమస్యలు వింటున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: వచ్చే సార్వత్రిక ఎన్నికలోపు శతశాతం హామీలన్నీ నెరవేర్చాలన్న దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పని చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మండల శివారు గ్రామం నీలకంఠాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ క్రమంలో జగనన్న పాలన బాగుందని పలువురు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాల నగదు నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నారన్నారు. ప్రధాన రోడ్డును ఆనుకుని దుర్గాలమ్మ గుడి నుంచి ఆర్‌అండ్‌బీ మదుం వరకు డ్రైనేజీ నిర్మించి మురుగు నీరు బయటకు పోయేలా చేయాలని, సూర్యనారాయణ కళ్లాల వరకు సీసీరోడ్డు నిర్మించాలని, గ్రామ ముఖద్వారం ఏర్పాటు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ప్రతిపాదనలు తయారు చేయాలని మండల అధికారులకు సూచించారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టి మురుగు నీటి ముంపు సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సాంకేతిక లోపాలతో ఎవరికైనా సంక్షేమ పథకాలు ఆగిపోతే తన దృష్టికి తీసుకురావాలని, వారికి తిరిగి అందిస్తామన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, సర్పంచ్ పడాల నాగభూషణం, సచివాలయ కన్వీనర్ పడాల మల్లునాయుడు, గ్రామ నాయకుడు ఎన్నెంశెట్టి రవి, తురకలపూడి కోఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జి భూషణం, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, నాయకులు బోయిన నారాయణమూర్తి పాల్గొన్నారు.

అధికారులను అడ్డం పెట్టుకున్నది టీడీపీనే?



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీలు

మాకవరపాలెం: జన్మభూమి కమిటీల పేరుతో అధికారులను అడ్డం పెట్టుకున్నది టీడీపీ నాయకులేనని వైస్ ఎంపీపీలు రుత్తల లక్ష్మి, రాజారావు విమర్శించారు. సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీకి ఎంపీడీవో మద్దతుగా ఉన్నారంటూ టీడీపీ నేతలు చేసిన ఆరోపణలను ఆదివారం వారు తీవ్రంగా ఖండించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నీ పబ్లిక్‌గా చేస్తున్నారని, తాము ఏ అధికారినీ అడ్డుపెట్టుకోలేదని, ఎవరికీ భయపడాల్సిన పనీ లేదని స్పష్టం చేశారు. సమావేశంలో లేని వ్యక్తులు, అక్కడ ఏం జరిగిందో తెలియకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో బయట వారిని వెళ్లాలని ఎంపీడీవో, ఎంపీపీ చెప్పారన్నారు. దానికి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు టీడీపీ సభ్యులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూడలేకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పాశపు నాగేశ్వరరావు, చామంతిపురం, తూటిపాల, మామిడిపాలెం సర్పంచ్‌లు బొడ్డు గోవిందరావు, ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీ సిబ్బంది

మాడుగుల: స్థానిక మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆదివారం అన్ని వీధుల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ కళావతి, పంచాయతీ కార్యదర్శి నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు ఈ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 6న అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ తరపున అన్ని రకాల సేవలు అందిస్తామన్నారు. భక్తులు తమతో సహకరించాలని కోరారు.

11న 'మోడల్' ప్రవేశ పరీక్ష

చీడికాడ: మంచాల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 11న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు. విద్యార్థులు ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 7వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు.

వర్షంతో ఉపశమనం



రోలుగుంటలో పడుతున్న వర్షం



నాతవరం వెళ్లే రోడ్డుపై పారుతున్న నీరు

నాతవరం: ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఉక్కపోతతో ఎండ కాచింది. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని చల్లని గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి తాండవ జంక్షన్ ములపూడి, బెన్నవరం, వెన్నలపాలెం, మర్రిపాలెం గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నీరు పారింది. ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగింది. ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాడి పశువులకు పొలాల్లో పశుగ్రాసం పెరుగుతుందని చెబుతున్నారు.

మాకవరపాలెం: మండలంలో కురిసిన వర్షంతో ప్రజలకు ఉపశమనం లభించింది. నాలుగు రోజులుగా భారీగా కాస్తున్న ఎండకు ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఆదివారం ఉదయం నుంచి వడగాలులతో ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రం 4 గంటల తర్వాత వాతావరణం చల్లబడి ఉరుములు, పిడుగులతో సుమారు గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజలంతా ఉపశమనం పొందారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల రూరల్: ఈదురు గాలులతో కూడిన స్వల్పంగా కురిసిన వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వల్ల రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కొన్ని చోట్ల తీగలు తెగిపోవడంతో సిబ్బంది వెంటనే సరఫరా పునరుద్ధరించారు.

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడగా జనం వేడిగాలులు, ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. రోహిణి కార్తెల సందర్భంగా నాలుగు రోజులుగా వేడిగాలులతోపాటు ఉక్కపోతకు గురై ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తీవ్రంగా ఎండ కాసింది. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం పడింది. ఎండలకు వడలిపోయిన మినప, పెసర, బొబ్బర, నువ్వు పంటలకు మేలు చేస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు



మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయం 13 వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఇక్కడ గత నెల 25న ప్రారంభమైన ఉత్సవాలు సందర్భంగా ఉదయం స్వామివారి పూర్ణాహుతి, వసంతోత్సవం, నాగవల్లి సంబరాలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వసంతోత్సవం, పుష్పాంజలి సేవ, ఊంజల్‌సేవ, దర్పణ దర్శనం కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త రాపేట రామకొండలరావు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి ఆడారి సన్యాసినాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సన్యాసమ్మ తొలేళ్ల పండగ నేడు

- జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు రేపు
- ఆఖరి రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు



కత్తి ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు



ముస్తాబైన సన్యాసమ్మ అమ్మవారి ఆలయం



దేవరాపల్లిలో విశేష అలంకరణలో సన్యాసమ్మ అమ్మవారు

దేవరాపల్లి: స్థానిక ప్రజల ఆరాధ్య దైవం సన్యాసమ్మ తల్లి పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు భారీగా ఏర్పాట్లు చేశారు. నెల రోజుల వేడుకలలో భాగంగా ఆదివారం అమ్మవారికి గ్రామస్తులు విశేష పూజలు చేశారు. దీనిలో భాగంగా సోమవారం తొలేళ్ల కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆఖరి రోజు అమ్మవారి పండగకు ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి వేలాదిగా భక్తజనం తరలి రానున్న నేపథ్యంలో అందుకుదగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు మధ్యాహ్నం జిల్లా స్థాయి గుర్రపు పోటీలను నిర్వహించి, విజేతలకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులు అందజేస్తామని ఉత్సవ కమిటీ తెలిపింది. అదేరోజు రాత్రికి డీ ప్రోగ్రాం, పుణే మహిళలతో బ్యాండ్ బాజా, జైపూర్ వారి బ్యాండ్, దోబిచెర్ల వారితో కాంతార వేషధారణలు, విజయనగరం వారితో పులివేషధారణలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలను విధిగా పాటించాలి

సన్యాసమ్మ తల్లి పండగకు భారీగా భక్తజనం హాజరు కానున్న నేపథ్యంలో గ్రామంలో ట్రాఫిక్ ఆంక్షలను విధిస్తున్నట్లు ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమ, మంగళవారాలు గ్రామంలోకి ఆర్టీసీ బస్సులు సహా ఇతర ఏ వాహనాలు రాకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించామన్నారు. రైవాడ కెనాల్ వద్ద లేదా పెట్రోల్ బంక్ వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ఆంక్షలను అతిక్రమించిన వారి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వంద మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, మఫ్టీ పోలీస్ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు.

పడమటమ్మలోవలో పౌర్ణమి హోమాలు

కోంకోట : మండలంలోని విసన్నపేట పడమటమ్మ లోవలో ఆదివారం పౌర్ణమి పురస్కరించుకుని హోమాలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పూజా ద్రవ్యాలతో హోమం చేశారు. గురువు పెనుమటి సాంబమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి, హోమంలో పాల్గొని పడమటమ్మ వారిని దర్శించుకున్నారు.

పనసలపాడు గిరిజన బాధితుల ఆందోళన



పనసలపపాడులో ఆందోళనకు దిగిన గిరిజనులు

రోలుగుంట: గిరిజనులకు దక్కాల్సిన భూముల పట్టాలు గిరిజనేతరులకు దక్కడంపై పనసలపాడుకు చెందిన గిరిజన బాధితులు అయిదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు కె.గోవిందరావు ఆధ్వర్యంలో ఆదివారం తమ గ్రామంలో ఆందోళనకు దిగారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 12 గిరిజన కుటుంబాల సాగులో ఉన్న భూములను జగనన్న భూ హక్కు రీసర్వే చేశారన్నారు. దానికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు మాత్రం 8-1 సర్వే నంబర్‌లోవి గిరిజనేతరులకు ఇచ్చారని వాపోయారు. ఇది అన్యాయమన్నారు. సాగుల్లో ఉన్న గిరిజనుల అర్హతలను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని డిమాండు చేశారు.

పర్యావరణంపై కళాజాత నేడు

అనకాపల్లిటౌన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పట్టణంలో కళాజాత, వీధి నాటికల ద్వారా ప్రజలను అవగాహన కల్పించనున్నట్లు మండలి సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్లు తెలిపేలా వీధి నాటకాలు, కళాజాతాలను ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు.